ప్రతిజ్ఞ • గోప్రాజ్

ఇంట్లోకి అడుగు పెట్టిన భైరవమూర్తి కళ్ళు... టేబుల్‌పై ముద్దులొలికే చిన్న సైజు ప్రయిజ్ కప్పుని దాని క్రింద ఓ... సర్టిఫికెట్ని గమనించాయ్.

తండ్రి రాక కోసం ఎదురు చూస్తున్న పద్నాలుగేళ్ల చతుర...

"...నాన్నగారూ...! నాకు 'డిబేట్'లో ఫస్ట్ ప్రయిజ్ వచ్చింది తెలుసా.." అంది.

చతుర ముఖంలో సంతోషపు వెల్లువ.

"...ఏ సబ్జక్ట్ మీదమ్మా...?" అనడిగాడు భైరవమూర్తి ఆనందంగా కప్పుని సర్టిఫికెట్ని చేతులోకి తీసుకుంటూ...

"...సోషల్ ఆక్ట్‌విటీస్ ఇన్ పబ్లిక్ లైఫ్..." అంది చతుర.

"...వెరీ నైస్.." అంటూ కూతురి మేను నిమిరాడు ఆప్యాయంగా భైరవమూర్తి. అయిన వాళ్ళు పొగిడితే ఆయుష్షు తగ్గుతుందని లోలోపలే గర్వపడ్డాడు. తెలివి తేటల్లో తన పోలికొచ్చినా అదృష్టంలో మాత్రం వద్దని మనసులోనే దీవించాడు కూతుర్ని మనస్ఫూర్తిగా భైరవమూర్తి.

"చతురా..! అన్నయేడమ్మా...?"

"...నోట్సేదో తెచ్చుకుంటానని ఫ్రెండింటికి వెళ్లాడు..." అంది చతుర.

★ ★ ★ ★

...రాత్రి 10 గం.లు దాటుతోంది. ఉన్నవి రెండే గదులు.

"... పిల్లలు పడుకున్నారా జానకీ...?" అనడిగాడు భైరవమూర్తి. ఆమె నుంచి వచ్చిన సమాధానం వింటూ భార్యని దగ్గరకి తీసుకున్నాడు భైరవమూర్తి.

"... ఏవండీ..." అంది జానకి.

ఏమిటన్నట్లు చూసాడు భైరవ మూర్తి.

"... అబ్బే ఏం లేదండి..! ఈరోజు మధ్యాహ్నం వరండాలో పక్కింటి పిన్నిగారూ... నేను ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. ఇంతలో చతుర ఎవరో తరుముకొస్తున్నట్లు వడివడిగా ఇంటి కొచ్చిందండి. వచ్చేటప్పుడు ఓ అమ్మాయ్‌ని కూడా వెంటబెట్టు కొచ్చింది. నేనైతే చాలా ఆందోళన పడ్డాను. కాళ్ళల్లో వణుకు తెలుసా..." అంది జానకి మధ్యాహ్నపు సంఘట్ని మననం చేసుకుంటూ.

"... ఏం..? చతుర ఈ రోజు మధ్యాహ్నం స్కూల్‌కి కారియర్ పట్టుకెళ్లలేదా...?"

"... దాని ముఖం... అది కాదండి స్కూల్లో టాయ్‌లెట్స్ క్లీన్‌గా ఉండటం లేదట. అందుకని అంత దూరంనించి నడిచొచ్చింది..."

"...అది సరే... ఇంతకీ నీ కాళ్ళకు వణుకెందుకట...?"

"...ఎందుకంటా రేమిటండీ..?ఎదుగు తున్న ఆడపిల్ల, పైగా అర్థాంతరంగా ఎవర్నో వెంటబెట్టు కొచ్చింది. అలా స్కూలు మధ్యలో వస్తే ఆ వయసులోని పిల్లని చూసి ఏ తల్లి మాత్రం ఏం అనుకుంటుంది...!!

ఏవో మాటల మీద మనం అనుకున్నదంతా పిన్నిగారికి చెప్పేసాను. మనింట్లో అటువంటి విశేషం జరిగితే గప్‌చిప్‌గా ఊరుకుంటామని... ఏవండోయ్ వింటున్నారా...."

జానకి ఒడిలో ఉన్న భైరవమూర్తి... తలని

"ఆ...ఆ" అంటూ ఆడించాడు.

"...ఒక్కగానొక్క పిల్ల... కనీసం చాపైనా వేసి నాలుగిళ్ళకయినా పప్పు అన్నం పెట్టరా...! చుట్టుపక్కలందరూ అదే మాట. అయినా మన కష్టాలు వాళ్ళకేం తెలుసు ఏవంటారు...?

ఏమంటాడు భైరవమూర్తి మౌనంగా

ఆమె చెప్పింది వింటున్నాడు.

ఇంకో విషయం రాఘవకి బొటానికల్ టూర్ డబ్బు కట్టడానికి రేపే లాస్ట్ డేటట. మీకు వీలవుతుందా...?'' అంటూ చూసింది జానకి భైరవమూర్తి వంక.

జానక్కి తెలుసు. పుస్తకాలకి, ఫీజులు కట్టడానికే అంతంత మాత్రంగా ఉన్న భర్త పరిస్థితి.

వేడి నిట్టూర్పులు ఆ గది నిండా ఆవరించాయ్.

* * * *

భైరవమూర్తి ఎకడమిక్ క్వాలిఫికేషన్ యం. ఎ. బి. ఎల్. అయినా చేసేది మాత్రం ఓ కంపెనీలో గుమాస్తా. పూర్వపు రోజుల్లో భైరవమూర్తి తండ్రి పేరు మోసిన క్రిమినల్ లాయర్. సంపాదించింది గంపెడయినా కాలచక్రంలో కొడుక్కి న్యాయంగా మిగిలింది ఓ నల్లబోర్డు మీద భైరవమూర్తి యమ్. ఎ. బి. ఎల్ అన్న తెల్లటి అక్షరాలు.

కొన్నాళ్ళు ఆ... బోర్డు వీధి గేటుకి వ్రేలాడి ఎండకు ఎండుతూ, వానకి తడుస్తూ... ఆ తర్వాత భైరవమూర్తి వ్యక్తిత్వానికి సరిపోని ఆ లా బోర్డు ఆఖరికి బూజుపట్టి అటకెక్కింది. 'లైఫ్ ఫర్‌యెగ్జిస్టెన్స్'లా ఉంది భైరవమూర్తి బ్రతుకు.

* * * *

ఆ... మర్నాటి ఉదయం జానకి....

''... ఏవండీ..! మరచే పోయాను ఆ సూపరింటెండెంట్ గారమ్మాయ్ పెద్ద మనిషయిందట..! పేరంటానికి, భోజనానికి పిలిచారు. వట్టి చేతులతో వెళితే ఏం బావుంటుంది...'' అంటూ మట్టి గాజుల చేతిని చాచింది ఓ పది రూపాయ లిమ్మంటూ.

ఆ మాటలకి భుజాలు తడుముకున్న భైరవమూర్తి జేబులు మాత్రం తడుముకో లేదు. అవి నెలాఖరు రోజులు అతని జేబులో ఎంతుంటుందో అతనికి తెలుసు.

భర్తని చూసి సంగతి గ్రహించి....

''....పరవాలేదు లెండి..! ఆ మధ్య ఎవరో ఇచ్చిన స్టీలు ప్లేటుంది అదృష్టంగా దాని మీద ఇచ్చిన వారి పేరు లేదు. అదిస్తాన్లెండి...'' అంది జానకి.

ఆ మాటలకి భైరవమూర్తి నవ్వుకున్నాడు ఒక్కక్షణం. నిజమే. . ఆ ప్లేటు మీద ఇచ్చిన వారి పేరు లేకపోవడం కూడా ఒక అదృష్టమే...

ఆ కాస్సేపటికి... ఆఫీసుకి బయలుదేరుతున్న భైరవమూర్తితో....

''నాన్నగారూ...'' అని పిలిచాడు రాఘవ.

''ఏమిటన్నట్టు' చూసాడు భైరవమూర్తి. భైరవమూర్తి అంతరంగంలో కొడుకు టూర్‌కి డబ్బడిగితే ఎలా బీదరుపులు అరవాలా అని ఆలోచిస్తున్నాడు.

''... ఈసారి టూర్ వెళ్లను నాన్నగారూ....! వచ్చే సంవత్సరం నార్త్ ఇండియా తీసుకు వెళతారట. అప్పుడు వెళతాను..''

ఆ మాటలు రాఘవ నోటి వెంట నమ్రతగా వచ్చాయ్.

భైరవమూర్తి కళ్ళు చురుగ్గా చూసాయ్ కొడుకుని.

భైరవమూర్తి రోడ్డు వారగా మౌనంగా నడుస్తున్నాడు. అతని మనసు నిండా గజి, బిజి ఆలోచన్లు కందిరీగల్లా రొద చేస్తున్నాయ్. తండ్రి అన్యాయార్జితం తన్ని శాపగ్రస్తుణ్ణి చేసిందా....? అతని దృష్టి కొడుకు మీదకి మళ్ళింది. ఎదిగే వయసులో కోరిక లెక్కువ. అయినా వాడడిగింది 'బొటానికల్' టూర్‌కి. అది వాడి ఎడ్యుకేషన్‌కి అవసరం కూడా. క్రిందటి సంవత్సరం కూడా టూర్ కని డబ్బడిగితే వచ్చే సంవత్సరం వెళుదువుగాని అని దాటించేసాడు.

గాంధీగారి నడకలా నడిచే భైరవమూర్తి కాళ్ళు ఆ రోజు నత్త నడక నడిచాయ్. ఫలితం గంట లేటు ఆఫీసు చేరడానికి.

అకౌంట్స్ ఫైలు తీసాడు భైరవమూర్తి. 'కాలిక్యులేటర్' అవసరం లేని అతని మెదడుకి ఆరోజు 'కాలిక్యులేటర్' ఉపయోగించినా అంకెలన్నీ తలక్రిందులవుతున్నాయ్.

చేసిన తప్పులకి ఆఫీసర్‌చే తిట్లు తిని,

తప్పక ఆ ఆఫీసర్సే 'నాట్ ఫీలింగ్ వెల్' అని పర్మిషన్ అడిగి మండుటెండలో ఇంటి కొచ్చాడు భైరవమూర్తి.

పెట్టడుగున, పదిలంగా దాచిన పెళ్ళినాటి పట్టు చీరని సింగారించుకొని సమర్త భోజనానికి బయలుదేరుతున్న భైరవమూర్తి భార్య, భర్త రాకకి ఒకింత అచ్చెరువొంది గేటుకి తాళం వేయబోతున్నది ఆగి లోపలికి వచ్చింది.

ప్రతిజ్ఞ

"... ఏవండీ..! వచ్చేసారేం...? ఏం అలా ఉన్నారు...?" అంటూ భైరవమూర్తి నుదుర్నిపట్టుకు చూసింది జానకి.

"ఏం లేదు...! కొంచెం తల నెప్పిగా ఉంటే పర్మిషన్ పెట్టి వచ్చాను అంతే..." అన్నాడు భైరవమూర్తి.

చీర మార్చుకో బోతున్న భార్యని చూసి–

"...ఏం ఫరవాలేదు. నేను రెస్ట్ తీసుకుంటాను. ఎక్కడికో వెళుతున్నట్లున్నావు వెళ్లు..." అన్నాడు భైరవ మూర్తి.

సతమత మవుతున్న మనసుకి విశ్రాంతిగా నిద్రలో కొరిగాడు భైరవ మూర్తి.

* * * * * * *

"....ఏవండీ...! ఆ సూపరింటెండెంట్ గారమ్మాయ్ సమర్తకి ఎంత అట్టహాసం చేసారండి. ఆ ... నగలతో, సింగారాలతో ఆ పిల్లకి పెళ్ళి కళ ఉట్టిపడిందండి. ఓ... హో... ఏమి ఆర్భాటాలు షామియానాలా.. భజంత్రీలా.. వీడి యోలా... నవకాయ పిండి వంటలతో భోజనాలా.. దేనికైనా పెట్టి పుట్టాలండి. పెట్టి పుట్టాలన్న మాటని మరింత గట్టిగా వత్తి పలుకుతూ... జానకి.

భార్య మాటలకి ఉలిక్కి పడ్డాడు భైరవమూర్తి.

"... మనిషన్న తర్వాత సరదా లుండాలండి. ఆ పిల్ల నిజంగా అదృష్టవంతురాలు. అటువంటి తండ్రి కూతురయినందుకు..."

"... అంటే నీ ఉద్దేశం...?" అనడిగాడు భైరవమూర్తి.

"—విడమర్చి చెప్పాలా... ఎదుగుతున్న కూతురుంది. దానికి చిన్న మెత్తు గొలుసు చేయిద్దాం. రేపో శుభ కార్యం దగ్గిర కొస్తోంది, దాని గురించాలో చిద్దాం. అన్న చింత మీకేకోశాన్నయినా ఉందా...?

మీ రెన్నయినా చెప్పండి. మనకెప్పుడూ ఉండే దరిద్రమే... ఇదుగో... ఇప్పుడే చెబుతున్నాను. అప్పు చేస్తారో... తల తాకట్టు బెడతారో ఆ... అచ్చట జరగ వలసిందే. ముసలి కాలానికి ముచ్చ ట్లులా ఎప్పుడో ఏదో చేద్దాం అంటే కాలం ఆగదు. అది పెద్దయిం తర్వాత నా తల్లి తండ్రి నాకే ముచ్చటా జరిపించ లేదంటే ఎంత సిగ్గండీ...!"

అంటూ భైరవమూర్తిని ఉతికి ఆరేస్తోంది జానకి.

జానకి మాటలకి–

"... ఉహ్... గట్టిగా అరవకు పిల్లలు వింటారు..." అన్నాడు భైరవమూర్తి.

"... గట్టిగా అరిస్తేనే వినిపించని మీకు సున్నితంగా చెబితే అర్థం అవుతుందా...!"

"... సర్లే అలాగే చేద్దాం..."

"... చేద్దాం అంటే కాదు మాటివ్వాలి..."

"అలాగే...!"

"... ఎలా చూసినా మన ఊర్లో దగ్గర బంధువులు వందమందుంటారు. మా అక్కలు బావలు మీ దగ్గర వాళ్ళు కలసి ఓ యాభై వేసుకోండి...."

భైరవమూర్తి గుండెల్లో విమానాలు స్వైర విహారం చేస్తున్నాయ్.

"... నువ్వు చెప్పిందాన్ని బట్టి చూస్తే కనీసం ఓ... ఐదు వేలు పై చిలుకే అయ్యేలా ఉంది. ఇంత సొమ్ము ఎక్కడ్నించి తేగల్వు...?"

"... అవునుమరి... మీ అక్క చెల్లెళ్ళకయితే ఎక్కడలేని సొమ్ము ఉరుక్కుంటూ వస్తుంది. సొంత కూతురి దగ్గర కొచ్చేటప్పటికి ఎక్కడలేని కూడికలు, 'సాకులు...!" అంటూ రెచ్చ గొట్టింది జానకి.

భైరవమూర్తిలో సహనం నీరసించింది.

"... జానకీ..." అంటూ అరిచాడు దిక్కులు పిక్కటిల్లేలా..

ఫంక్షన్ నుంచి అప్పుడే ఇంట్లో కడుగు పెట్టిన జానకి భర్తని చూసి...

"... ఏమిటండీ...! అలా అరు స్తున్నారు. ఏమైనా పాడు కలొచ్చిందా..." అనడిగింది భైరవమూర్తి దగ్గరగా వస్తూ...

"... ఓ...హ్... ఇది కలా..." అంటూ కళ్ళు నులుము కున్నాడు భైరవమూర్తి. అతని ముఖంలో రిలీఫ్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

* * * * *

అప్పుడు సమయం రాత్రి 8 గం.ల్లు అవుతోంది.

వరండాలో కుర్చీలు వేసుకొని కూర్చున్నారు భైరవమూర్తి, జానకి.

భైరవమూర్తి శూన్యంలోకి చూస్తు న్నాడు. మధ్యాహ్నం అతను కన్న కల కళ్ళలో కరడు గట్టి అలాగే ఉండి పోయింది.

"... ఏమిటండీ...! అలా ఉన్నారు...? ఏమిటలా దీర్ఘంగా ఆలోచిస్తు న్నారు...?"

"... ఏంలేదు జానకీ...! నాకూ కోరిక లున్నాయ్. ఎదిగిన ఆడపిల్లకి చిన్న మెత్తు గొలుసయినా చేయించలేక పోతున్నాను..."



" ఇప్పుడవన్నీ ఎందుకండి... ఎవరేమన్నారని "

"ఎవరో ఏదో అంటారని కాదు జానకీ ! రేపొద్దుట దీనికేమైనా జరిగి, మనం ఏ పంక్షనూ చెయ్యలేక పోతే తోటి పిల్లల్తో పోల్చుకొని అమ్మాయి బాధపడదూ ! ఏ అచ్చటా ముచ్చటా తీర్చలేదని ఆలోచించదూ !"

" ఏమిటండీ ! అన్నీ తెలిసిన మీరూ ఇలా మాట్లాడు తున్నారు ఈ రోజు ఏం ఫరవాలేదు లెండి, దానికి నేను నచ్చ చెబుతాను రోజు లెప్పుడూ ఒకలాగే ఉండవ్ మీరీ విషయంలో వర్రి కాకండి ' అంది జానకి అనునయంగా !

మధ్యాహ్నం కలలోని జానక్కి ఈ జానక్కి ఎంత వ్యత్యాసం

" జానకీ ! నిజంగా నీలాంటి అనుకూలవతైన భార్య దొరకడం ఆ భగవంతుడు ఇచ్చిన వరం నాకు

ఆ మాటలు భైరవమూర్తి నోటివెంట గాద్గదికంగా వచ్చాయ్

ఆ కాస్సేపటికి లివింగ్ రూమ్‌లో చదువుకుంటున్న పిల్లల గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయ్ చతుర ఏదో ఆవేశంగా గట్టిగా మాట్లాడుతోంది భైరవమూర్తి చెవులకి ఆ సంభాషణ ఆకర్షణీయంగా అనిపించి మరింత దగ్గరగా వినాలన్న కుతూహలంతో కూతురున్న గదిలోకి నడిచాడు ఆ వెనుకగా జానకి

కిటికీ కర్టెన్ని పక్కకి తొలగించి చూసిన చతుర తల్లి తండ్రి రాకన్ని గమనించి తన కంఠస్వరాన్ని మరింత తీవ్రత చేసింది

"ఇంకా వివరంగా చెప్పాలంటే ఈ సమర్త అన్న పరిస్థితి ప్రతి స్త్రీకి ఒక నేచర్ అదో గొప్ప విశేషంగా చూస్తూ దాన్ని ఎన్‌లార్జ్ చేసి సంప్రదాయం అనే చచ్చు పేరుతో ఉన్నా లేకపోయినా ఆప్పుకోసం అంగలార్చి ఆడంబరాలు చేస్తున్న మనవాళ్ళని చూసి మనం సిగ్గుతో తలలు వంచాలి

ఆ తరువాత పెళ్ళి పెళ్ళి అన్నది ఆడదానికెంత అవసరమో మగవాడికీ అంతే దానికోసం ఈ పెద్దలు అడుగులకి మడుగులొత్తడాలూ కాళ్ళు కడిగి కన్యాదానాలు కట్న కానుకలూ అలకలు తీర్చడాలూ ఎందుకు ? ఒళ్ళు ఇల్లు గుల్ల చేసుకోవడం ఎందుకు ?

అసలు ప్రతీ ఆడదీ కట్నం ఇచ్చే ప్రసక్తయితే పెళ్ళి చేసుకోనని భీష్మిస్తే ఈ మగజాతి అపరభీష్మ లవుతారా ? నెవర్

మనల్ని మనం కించపరుచుకొనే రోజులు పోయాయ్ ఎవరో వస్తారు వారే గంటకడతారు అన్న భావనకి తిలోదకా లివ్వాలి ! ఏదో విప్లవం ఎక్కడినుంచో పుట్టుకురాకూడదు ఒక లక్ష్యసాధన కోసం మనోధైర్యంతో మనం అందరం సంఘటితంగా చేతులు కలిపితే అదే విప్లవం జడలువిప్పి ఆటలాడు తున్న ఈ కట్నాల జాడ్యాన్ని విదిలించి కొట్టాలంటి మనం కలిసి కట్టుగా కృషి చెయ్యాలి

మనం పిల్లలం మనకేం తెలుసు పెద్ద వారు చూసుకుంటార్లే అన్నభావన అసమర్థతకి చిహ్నం ఈ రోజు పిల్లలే రేపటి పెద్దలు

నామటుకు నేను ఈ విషయంలో మనసా వాచా 'ప్లెడ్జ్' తీసు కుంటున్నాను ఇదే ఆ రోజు డిబేట్ పోటీలో నేనిచ్చిన లెక్చర్ అన్నయ్యా ' అంది చతుర

చెల్లెలు చతుర వాగ్ధాటికి, ఆమెలో గూడుకట్టుకున్న ఆధునిక భావనలకి ఆశ్చర్యంతో సంతోషంతో చప్పట్లు కొట్టడమే కాక మనసులో తనూ 'ప్లెడ్జ్' తీసుకున్నాడు రాఘవ

ఎప్పుడూ విషం అనే వర్తమానంలో కొట్టుమిట్టాడుతూ భవిష్యత్తు అనే ఆశలేక అనుక్షణం బయం భయంతో మిడిల్‌క్లాస్ అనే ఈ సముద్రాన్ని ఈదడానికి పిల్లల ప్రోత్సాహం ఉంటే చాలన్న భావన ఆ దంపతుల్లో మెదిలి వారి చేతులకి కూడా ఊతం వచ్చి జోరుగా చప్పట్లు కొట్టాయ్

ఆ గదిలో చప్పట్లు మారు మ్రోగాయ్

"దిక్సూచి"

మతం అంటే-
మాయదారి మత్తు!
కులం అంటే-
కంపుకొట్టు కుళ్ళు!
ప్రాంతీయత అంటేనే,
పెరిగిన రాచపుండు!

భాషాభేదం అంటారా,
అది కత్తిలేని విషభాండం!

సమాజమంతా
కత్తిల అయోమయం
సంఘటితం కానిదే
జరగదెన్నటికీ న్యాయం

అందుకే-
స్వ పర భేదాలు మానాలి!
సంస్కారపుశక్తి రావాలి!
అన్నదమ్ముల మాదిరి,
అందరు కలిసి బ్రతకాలి!

మిన్నుమీదికొరిగినా
వెన్నువిరగబోయినా
చెక్కుచెదరని-
సైనికునిగా,
దేశమాతకు-
ఉక్కుకవచమై,
త్యాగభావపు,
నిండుకుండయై
శాంతి నింపాలి!
జగతిన-
క్రాంతి కురవాలి!!

- డా. కె.ఎల్.వి. ప్రసాద్